

అందరూ జగనన్న ఫ్యాన్స్

జిల్లాలో వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు కొనసాగుతోంది. పలువురు నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు.

- 8లో



నాని అనుచరుల వీరంగం

చంద్రగిరిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అనుచరులు వీరంగం సృష్టించి, ఇద్దరి యువకులపై దాడి చేశారు.

- 8లో



నేత్రపర్వం..తెప్పోత్సవం

తిరుపతిలోని శ్రీకోదండరామ స్వామి తెప్పోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి.

- 8లో

న్యూస్‌రీల్

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంకా అవసరమైన మౌలిక సదుపాయాలను సిబ్బందికి సమకూర్చాలని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాస రావును ఆదేశించారు. తమిళనాడు రాష్ట్రం నుంచి జిల్లాలోకి అక్రమంగా ఏమీ రాకూడదన్నారు. ఈ తనిఖీల్లో నాగలాపురం తహసీల్దారు డీ.నరసింహులు, ఎంపీడీఓ పీఎంకే బాబు, వీఆర్వో నాగభూషణం, డీటీ వెంకట సుబ్బయ్య, ఎస్‌ఐ ఓబయ్య పాల్గొన్నారు.

తడలో కలెక్టర్ పర్యటన

తడ: జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ ఆదివారం తడ మండలంలో పర్యటించారు. తొలుత బీవీపాళెం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం తడ తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్న ఆయన ఓటర్ల లిస్టు, వికలాంగులు, వృద్ధులకు సంబంధించిన ఓట్లు ఇంటి వద్ద నుంచే పోల్ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బదికి పలు సూచనలు చేశారు.

3 రోజులు..56 నామినేషన్లు

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. ఈ క్రమంలో జోరుగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లకు అవకాశం ఉంది. గడిచిన మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా తిరుపతి పార్లమెంట్ స్థానానికి 7, అసెంబ్లీ స్థానాలకు 49 నామినేషన్లు దాఖలయ్యాయి. గరిష్టంగా తిరుపతికి 19 నామినేషన్లు, కనిష్టంగా చంద్రగిరికి 3 నామినేషన్లు వేశారు. వచ్చే గురువారంతో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుంది. ఈ నెల 29వ తేదీ నాటికి నామినేషన్ల ఉపసంహరణ.. మే 13న పోలింగ్ దేకు యంత్రాంగం సిద్ధం కానుంది.

ఫిర్యాదులకు కమాండ్ కంట్రోల్ సెంటర్

తిరుపతి అర్బన్: ఎన్నికల కోడ్ ఉల్లంఘనతో పాటు ఇతర అంశాలను తెలియజేయడానికి కలెక్టరేట్‌లో జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఓటర్ హెల్ప్ లైన్ 1950, జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ నం .08772236007, 07382700300కి ఫోన్ చేసి సంప్రదించవచ్చు. ఫిర్యాదులను స్వీకరణకు వ్యయ పరిశీలకులు అందుబాటులో ఉంటారు. ఇందులో తిరుపతి ఎంపీ నియోజకవరానికి -ప్రదీప్ కుమార్ (9032666742), చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గాలకు వీజీ.శేషాద్రి (6281870157), గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు మీను ఓలా (9912340492)కు సమాచారం ఇవ్వొచ్చు.

కోలుకో బడి

పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి ఏదైనా ఉందంటే అది విద్య ఒక్కటే... నని రాష్ట్ర ప్రభుత్వం బలంగా నమ్మింది. అందుకే విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చింది. నాడు–నేడుతో సర్కారు బడుల రూపురేఖలు సమూలంగా మార్చేసింది. కార్పొరేట్‌ను తలదన్నేలా వసతులు సమకూర్చింది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అయితే ఈనాడు పత్రికకు ఇవేవీ కనిపించనట్టు విషం చిమ్మడం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది. దీనిపై తల్లిదండ్రులు, మేధావులు మండిపడుతున్నారు.

- నాడు–నేడుతో మారిన ప్రభుత్వ బడుల రూపురేఖలు
- ప్రభుత్వ విద్యపై పచ్చపత్రిక విద్వేషం
- పేద విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా తప్పుడు రాతలు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పకడ్బందీగా నాడు–నేడు పథకం



తిరుపతి జిల్లా, పాకాల మండలం, అచ్చమ్మఅగ్రహారం పాఠశాలలో గతంలో పరిస్థితి ఇదీ



తిరుపతి జిల్లా, పాకాల మండలం, అచ్చమ్మఅగ్రహారం పాఠశాలలో నేడు పరిస్థితి



టీడీపీ పాలనలో అధ్వానంగా ముడిపల్లి దళితవాడ పాఠశాల



వైఎస్సార్‌సీపీ పాలనలో అధునాతనంగా మారిన ముడిపల్లి దళితవాడ పాఠశాల

నగరి మండలం, ముడిపల్లి దళితవాడ ప్రాథమిక పాఠశాల గత ప్రభుత్వంలో శిథిలావస్థలో ఉండేది. టాయ్‌లెట్లు అధ్వానంగా ఉండేవి. నీటి వసతి ఉండేది కాదు. వెలగని లైట్లు, కూర్చోడానికి సరిపడా లేని కుర్చీలతో విద్యార్థులు ఆపసోపాలు పడేవారు. భవనం పైకప్పు పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉండడంతో భయభ్రాంతులకు గురయ్యేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పాఠశాలను రూ.18.27 లక్షల నిధులతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దింది. శిథిలమైన భాగాలను తొలగించి నవీకరించారు. పాడైన వైర్లు, లైట్లు, ఎలక్ట్రిక్ వస్తువులు తొలగించి నూతనంగా ఏర్పాటు చేశారు. టాయ్‌లెట్లు నిర్మించారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. గ్రీన్ చాక్ బోర్డు, ఇంగ్లిస్ ల్యాబ్ ఏర్పాటుచేశారు. పెయింటింగ్ చేసి పాఠశాలను చూడముచ్చటగా తీర్చిదిద్దారు. నాడు బిక్కుబిక్కుమంటూ 30 మంది కూడా చదవని ఈ పాఠశాలలో నేడు 53 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



ఈనాడు పత్రికలో ప్రచురితమైన కథనం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని సర్కారు బడులు నాడు–నేడుతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా ఆకట్టుకుంటున్నాయి. అయితే సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అందులో పనిచేస్తున్న సిబ్బంది ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేందుకు పచ్చపత్రిక విషం కక్కేందుకు సిద్ధమైంది. పూటకొక అబద్ధాన్ని సృష్టించి అదే నిజమని జనాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగానే ఆదివారం ఆ పత్రికలో ప్రచురించిన 'జగన్‌మామయ్య...మా కష్టాలు చూడయ్యా' శీర్షికన ప్రచురితమైన కథనంపై తల్లిదండ్రులు విరుచుకుపడుతున్నారు. అబద్ధపు రాతలతో నైతిక విలువలు దిగజార్చుకోవద్దని హితవు పలుకుతున్నారు.

కబోదిలా మారొద్దు

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నాడు–నేడు రెండు విడతల్లో చేపట్టిన పనులతో ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు సమకూరాయి. ఇంగ్లిష్ మీడియం, బైలింగువల్ పాఠ్యపుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, సీబీఎస్‌ఈ సిలబస్, బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, స్మార్ట్‌టీవీలు, సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్, తదితర సౌకర్యాలు ఏర్పాటయ్యాయి. విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలు అభివృద్ధి చెందాయి.

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాడు–నేడు మొదటి విడతలో 1,533 పాఠశాలల్లో రూ.354 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.
- రన్నింగ్ వాటర్‌తో కూడిన మరుగుదొడ్లు, ఫ్యాన్లు, విద్యుద్దీకరణ, ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్, పిల్లలు, టీచర్లకు, తరగతి గదులకు ఫర్నీచర్, పాఠశాలలకు రంగులు, మేజర్, మైనర్ మరమ్మతులు, గ్రీన్‌చాక్‌బోర్డులు, ఇంగ్లిష్‌ల్యాబ్, ప్రహరీగోడల నిర్మాణం, వంట గదులు, తరగతి గదుల నిర్మాణం వంటి పనులు చేపట్టి మొదటి విడత పనులు దిగ్విజయంగా పూర్తిచేశారు.
- చిత్తూరు జిల్లాలో రెండో విడతలో 1,183 సర్కారు బడులు, 30 జూనియర్ కళాశాలల్లో రూ.424 కోట్లతో పనులు జరుగుతున్నాయి.
- తిరుపతి జిల్లాలో రెండో విడతలో 1,047 పాఠశాలలు, 21 జూనియర్ కళాశాలల్లో రూ.369.49 కోట్లతో పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు.
- తిరుపతి జిల్లాలోని చంద్రగిరి నియోజకవర్గంలో 128 పాఠశాలలకుగాను రూ.4247.75 లక్షలతో రెండో దశ పనులు చేపట్టారు.
- చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో 267 పాఠశాలల్లో రూ.2129.05 లక్షలతో రెండో దశ పనులు సాగుతున్నాయి.

నాడు-నేడు తిరుపతి జిల్లాలో రెండో విడత పనుల సమాచారం

నియోజకవర్గం	పాఠశాలల సంఖ్య	ఖర్చు రూ.లక్షల్లో
చంద్రగిరి	123	4453.86
గూడూరు	155	5316.31
నగరి	65	2405.56
సత్యవేడు	201	7063.60
శ్రీకాళహస్తి	191	5983.12
సూళ్లూరుపేట	200	6994.23
తిరుపతి	43	1562.16
వెంకటగిరి	90	3170.70
మొత్తం	1,068	36949.54

బడికాదు బొమ్మరిల్లు!


పుత్తూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నాడు–నేడు పథకం ద్వారా అన్ని సౌకర్యాలతో బొమ్మరిల్లులా రూపుదాల్చింది. గతంలో దుస్థితిలో ఉన్న ఈ పాఠశాలను ప్రస్తుత ప్రభుత్వం రూ.68.93 లక్షలు వెచ్చించి ఆధునీకరించింది. ఫలితంగా పాఠశాలలో అందమైన డెస్కులు, గ్రీన్ బోర్డులు, మినరల్ వాటర్, ఆధునీకరించిన టాయ్‌లెట్స్, ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, లైట్లు, రంగుల బొమ్మల గోడలతో పాఠశాల విద్యార్థినులను విశేషంగా ఆకర్షిస్తోంది.



పుత్తూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల



టీడీపీ పాలనలో నాణ్యతలేని డెస్కులు



ప్రస్తుత ప్రభుత్వంలో నాణ్యమైన డెస్కులు

ఇదికదా అభివృద్ధి



గతంలో ఏ నాయకుడూ బడుల అభివృద్ధిని పట్టించుకోలేదు. ఇప్పుడేమో చేసి చూపించిన సీఎం జగనన్న పై లేనిపోని మాటలు అంటున్నారు. నా పాప నందిని గేట్‌పుత్తూరులోని జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. పాప చదివే బడిలో అన్ని సౌకర్యాలు కల్పించారు. గతంలో ఆడ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించాలంటే భయమేసేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ధైర్యంగా పంపొచ్చు.
– పద్మ, విద్యార్థిని తల్లి, పుత్తూరు, తిరుపతి జిల్లా

బాగు'బడి'



నేటి ప్రభుత్వంలో రాష్ట్రంలోని దాదాపు ప్రతి పాఠశాల ఆధునీకరించబడింది వాస్తవాం. కళ్లముందు కనబడేదాన్ని ఎవరూ కాదనలేరు. పుత్తూరు పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల అందంగా ముస్తాబైంది. ప్రస్తుత ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోంది. ఇందుకు నాడు–నేడు కింద బాగుపడిన పాఠశాలలే నిదర్శనం. గతంతో పోలిస్తే పాఠశాలలు వంద శాతం మెరుగుపడ్డాయి. మంచి ఫలితాలు సైతం వస్తున్నాయి.
– బీ.భాస్కర్‌రాజు, రిటైర్డ్ టీచర్, పుత్తూరు

నా సర్వీసులో ఇలా చూడలేదు




నేను సర్వీసులో చేరినప్పటి నుంచి చాలా పాఠశాలల్లో పనిచేశాను. ప్రభుత్వ బడుల కోసం కోట్ల రూపాయలను ఖర్చు చేసిన ప్రభుత్వం ఏదీ లేదు. బడుల్లో ఏ చిన్న పని చేయాలన్నా ఎన్నో నివేదికలను పంపాల్సి వచ్చేది. ప్రస్తుతం ఒక్కో బడికి నాడు–నేడుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఆ నిధులతో పేద విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు సమకూరాయి.
– శివయ్య, రిటైర్డ్ టీచర్, కార్వేటినగరం మండలం

కూటమిలో.. ఓటమి భయం!

ఓటమి భయంతో కూటమి అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ గందరగోళం సృష్టిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో వారు అనుసరించిన తీరుపై కూటమి శ్రేణులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరి కూటమి టీడీపీ అభ్యర్థిగా లక్ష్మీసాయి పేరును ఇదివరకే ప్రకటించారు. కానీ అక్కడ కూటమి అభ్యర్థి ఓటమి ఖాయమని తేలడంతో అభ్యర్థి మార్పుపై తర్జనభర్జన పడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి నేదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు కూటమికి సరైన అభ్యర్థి దొరకకపోవడంతో తప్పని పరిస్థితిలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేతికి బీఫాం ఇచ్చారు. ఇక ఇన్నాళ్లూ నాన్చుతూ వచ్చిన సత్యవేడు, జీడీ నెల్లూరు అభ్యర్థుల విషయాన్ని ఆదివారం ఎట్టకేలకు తేల్చేశారు.. గతంలో ప్రకటించిన ఆదిమూలం, థామస్‌కే బీఫాం అందజేశారు.

- వెంకటగిరి కూటమి అభ్యర్థిని మార్చిన బాబు
- ఆరణికి బీఫాం లేని ఖాళీ కవర్ ఇచ్చిన పవన్
- ఆపై అందరినీ పిలిపించి వారి చేతిలో బీఫాం పెట్టిన జనసేన అధినేత
- సత్యవేడు, జీడీ నెల్లూరు విషయాన్ని తేల్చేసిన వైనం
- బాబు, పవన్ అర్థం లేని ఆలోచనలతో కూటమి నేతల్లో ఆందోళన



సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూటమి అధినేతలకు ఓటమి భయం పట్టుకుంది. గతంలో ప్రకటించిన అభ్యర్థులను కాదని వేరొకరి బీఫాం అందజేయడం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. నిన్నటి వరకు వెంకటగిరి కూటమి టీడీపీ అభ్యర్థి అని ప్రచారం చేసిన లక్ష్మీసాయిని కాదని ఆమె తండ్రి కురుగొండ్ల రామకృష్ణకు ఆదివారం బీఫాం అందజేశారు. దీంతో అలిగి చెన్నైకి వెళ్లిపోయినట్లు ఆమె వర్గీయులు చెబుతున్నారు. యువత రాజకీయాల్లోకి రావాలంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన చంద్రబాబు అండ్ కో లక్ష్మీసాయికి వెన్నుపోటు పొడవడంపై ఆమె వర్గీయులు మండిపడుతున్నారు. ఆశ పెట్టి, ఇన్నాళ్లు ప్రచారం చేయించి, చివరకు అభ్యర్థిని మారుస్తారా? అంటూ రగిలిపోతున్నారు.

కవర్‌లో 'పవర్' లేదు

తిరుపతి స్థానం కోసం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, జేబీ శ్రీనివాసులు, ఊకా విజయకుమార్‌తో పాటు మరికొందరు టీడీపీ నేతలు, జనసేన నుంచి పసుపులేటి హరిప్రసాద్‌తో పాటు కనీసం 10 ఓట్లు కూడా లేని ఓ చిల్లర నాయకుడు సైతం టికెట్ ఆశించారు. చివరకు చిత్తూరు నుంచి వలస వచ్చిన ఆరణితో బేరం కుదరడంతో తిరుపతి కూటమి అభ్యర్థిగా ఆయన పేరును ప్రకటించారు. అయితే ఆరణి అభ్యర్థిత్వాన్ని స్థానిక నేతలు వ్యతిరేకిస్తూనే వచ్చారు. అందులో భాగంగా పవన్ ప్రత్యేక విమానంలో తిరుపతికి వచ్చి ఓ ప్రైవేటు హోటల్‌లో మధ్యస్తం నెరిపారు. చిత్తూరు ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు స్థానికులను, కార్యకర్తలను పట్టించుకోకుండా అవినీతి అక్రమాల్లో దిట్ట అయిన ఆరణికి ఎలా టికెట్ ఇస్తారని పవన్‌ని ప్రశ్నించినట్లు ప్రచారం జరిగింది. ఈ పరిస్థితిలో అభ్యర్థిని మారుస్తారని నేతలంతా భావించారు. అయినా పవన్ ఆరణి వైపే మొగ్గుచూపారు. ఈ పరిస్థితిలో మూడు రోజుల క్రితం బీఫాం కోసం అమరావతికి వెళ్లిన ఆరణికి పవన్ ఇచ్చిన కవర్ షాక్ ఇచ్చినట్లు సమాచారం. అందులో బీఫాం లేకపోవడంతో ఆరణి అసంతృప్తికి లోనైనట్టు తిరుపతిలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఆ తర్వాత తిరుపతికి చెందిన జనసేన నేతలందరినీ అమరావతికి పిలిపించి బీఫాంని వారి చేతిలో పెట్టి పంపించడంతో ఆరణి ఊపిరి పీల్చుకున్నారు.

గాంధీ వద్దు..థామస్ ముద్దు

గంగాధరనెల్లూరు కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ సామాజికవర్గం విషయంపై వివాదాలు నడుస్తున్న విషయం తెలిసిందే. ఆయన ఎస్సీ కాదని అనేక కథనాలు వచ్చాయి. దీంతో థామస్‌ని మారుస్తారని భావించారు. స్థానిక టీడీపీ నేతలు కూడా థామస్ వద్దని వేరొకరికి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు కారణం లేకపోలేదు. థామస్ స్థానిక నాయకులను పక్కనబెట్టి చెన్నై నుంచి తెచ్చుకున్న తన మనుషుల ద్వారా వ్యవహారాలు నడిపిస్తూ టీడీపీ నేతలను అడుగడుగునా అవమానిస్తున్నారని కూటమి నేతల ఆరోపణ. ఈ పరిస్థితుల్లో రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే గాంధీ నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆయన చేత చంద్రబాబే వేయించారనే ప్రచారం జరిగింది. అయినా బాబు థామస్‌కే బీఫాం ఇచ్చారు. స్థానిక టీడీపీ నేతలకు విలువ లేకుండా చేశారని ఆ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సత్యవేడు.. డోంట్ కేర్

సత్యవేడులో మొదటి నుంచి పార్టీ జెండాను మోసిన మాజీ ఎమ్మెల్యే హేమలత, జేడీ రాజశేఖర్ లాంటి వారిని చంద్రబాబు పక్కనపెట్టేశారు. తను ఎన్టీఆర్‌కి వెన్నుపోటు పొడిచనట్లు.. వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచి పచ్చకండువా కప్పుకున్న ఆదిమూలంని చంద్రబాబు నెత్తినపెట్టుకున్నారు. ఈ విషయం బయటపడకుండా.. స్థానిక నేతలతో అభ్యర్థి మార్పు విషయాన్ని నాన్చుతూ వచ్చారు. ఒక సమయంలో అభ్యర్థి మార్పు విషయంపై సర్వే చేయిస్తున్నానని, ఆ రిజల్ట్ తరువాత చెబుతానని చెప్పుకుంటూ వచ్చారు. అందులో భాగంగా ఆదిమూలాన్ని ప్రచారం చెయ్యొద్దు.. చంద్రబాబు చెప్పినట్లు టీడీపీ నేతలు ఊదరగొట్టారు. ఈ పరిస్థితుల్లో మాజీ ఎమ్మెల్యే హేమలత ఇటీవల నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇదంతా అభ్యర్థి మార్పు కోసమేనని టీడీపీ నేతలంతా భావించారు. అయితే స్థానిక నాయకుల ఆందోళనలను, ఆవేదనను చంద్రబాబు పెడచెవినపెట్టారు. అనేక పర్యాయాలు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా డోంట్ కేర్ అంటూ.. ఆదివారం ఆదిమూలానికే బీ ఫాం ఇచ్చారు.

ప్రజాస్వామ్య పండుగలో పాల్గొందాం..రండి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

- పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యం
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు
- తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులో ఓటుపై అవగాహన ర్యాలీ
- పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అర్హత పొందిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతిలోని ఎమ్మారపల్లి సర్కిల్ నుంచి లక్ష్మీపురం సర్కిల్ వరకు ఎయిర్ బైపాస్ రోడ్డులో ఓటు హక్కు వినియోగంపై బైక్ ర్యాలీ చేపట్టారు. ముందుగా ప్రజలు, విద్యార్థులు, అధికారులు ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత అక్కడే సంతకాల సేకరణ ఫ్లెక్సీపై తమ సందేశం ప్రజాస్వామ్య పండుగలో మనం అందరం పాల్గొందాం, స్వేచ్ఛ, పారదర్శక, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలుపుతూ సంతకాలు చేయించారు. అనంతరం బైక్ ర్యాలీని కలెక్టర్‌తోపాటు తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదిత్‌సింగ్ ప్రారంభించారు. ర్యాలీ అనంతరం మే 13వ తేదీ పోలింగ్‌డే నాడు ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములవుతాం అని ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ మే13న పోలింగ్ రోజున ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. 2024లో పోలింగ్ శాతం 90 నుంచి 95శాతానికి పెరగాలని ఆకాంక్షించారు. 85 ఏళ్లు పైబడి పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి హోం ఓటింగ్, అబ్సెంటీ ఓటర్లు, పీడబ్ల్యూడీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి మురళీకృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ అమరయ్య, డిప్యూటీ కమిషనర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, పలువురు అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్, కమిషనర్

క్లుప్తంగా

నేత్రపర్వం..తెప్పోత్సవం



శ్రీరామచంద్ర పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి తెప్పోత్సవాలు ఆదివారం శ్రీరామచంద్ర పుష్కరిణిలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారి తెప్పోత్సవాలు మూడు రోజుల పాటు జరుగనున్నాయి. ఇందులో భాగంగా తొలి రోజు విద్యుద్దీపాల అలంకరణలో తెప్పపై శ్రీసీతారామలక్ష్మణులు ఆశీనులై పుష్కరిణిలో ఐదు చుట్లు విహరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్ర మైనారిటీ సెల్ కమిటీ ఎంపిక

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా తిరుపతి జిల్లాకు చెందిన షేక్ సిరాజ్ బాషా, కార్యదర్శిగా షేక్ చాంద్‌బాషాను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అలాగే రాష్ట్ర ఎస్టీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కుడమల రామచంద్రయ్యను నియమించినట్లు ప్రకటించింది.

అడిగితే తంతాం..!



గత టీడీపీ హయాంలో అధికారం అడ్డుపెట్టుకుని కుప్పంలో తెలుగుదేశం నేతల అరాచకాలకు అడ్డూ అదుపూ ఉండేది కాదు. ముఖ్యంగా 2014–19 మధ్య కాలంలో పచ్చమూకల రౌడీయిజానికి పట్టపగ్గాలు ఉండేవి కావు. తమ అక్రమాలను ప్రశ్నించిన వారిపై మూకుమ్మడిగా మీద పడిపోయేవారు. ఆందోళనకు దిగిన ఇతర పార్టీల నాయకులపై దారుణంగా దాడులు చేసేవారు. అప్పట్లో చంద్రబాబు అండ చూసుకుని తెలుగు తమ్ముళ్లు సాగించిన దౌర్జన్యకాండను గుర్తుచేసుకుని కుప్పం వాసులు ఇప్పటికీ భయభ్రాంతులకు గురవుతున్నారు.

- కుప్పంలో టీడీపీ నేతల అరాచకాలు
- 2014–19 మధ్య అధికార బలంతో పచ్చమూకల రౌడీయిజం
- ప్రశ్నించిన వారిపై యథేచ్ఛగా దాడులు
- చంద్రబాబు దిష్టిబొమ్మ కాల్చారని వైఎస్సార్‌సీపీ నేతలపై దాష్టీకం
- హౌసింగ్ స్కీమ్‌పై చర్చకు పిలిచి చితకబాదిన వైనం



కుప్పం :కుప్పం నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ నేతలు యథేచ్ఛగా రౌడీయిజం చెలాయించేవారు. చంద్రబాబు పూర్తిస్థాయిలో అనుమతులు జారీ చేయడంతో పచ్చమూకలు రెచ్చిపోయేవి. సాధారనంగా రాజకీయ పార్టీల నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ఉంటారు. అయితే అప్పట్లో ఎవరైనా ఆరోపణలు చేసినా, తమ అక్రమాలను ప్రశ్నించినా టీడీపీ నేతలు భరించలేకపోయేవారు. ఏకంగా భౌతిక దాడులకు దిగేవారు.

ఎన్టీఆర్ ఇళ్లపై చర్చకు పిలిచి...

కుప్పం పట్టణంలో 2014 నుంచి చేపట్టిన ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్‌లో అవకతవకలు జరిగినట్లు అప్పట్లో వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేశారు. టీడీపీ నేతలు, వారి బంధువర్గాలకే ఇళ్లు కేటాయించారని విమర్శించారు. అర్హులైన పేదలను ఏమాత్రం పట్టించుకోలేదని నిలదీశారు. దీనిపై నిజనిర్ధారణకు పరస్పరం సవాళ్లు విసురుకున్నారు. ఈ క్రమంలో స్థానిక తిరుపతి గంగమ్మ దేవాలయం వేదికగా 2017 మే 14వ తేదీన సమావేశం చేపట్టారు. చర్చ ప్రారంభం కాగానే కాంగ్రెస్ నేత సురేష్‌బాబు, టీడీపీ నేత, అప్పటి జెడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్ వర్గాలకు వాగ్వాదం మొదలైంది. టీడీపీ వర్గీయులు మూకుమ్మడిగా దాడికి దిగారు. కాంగ్రెస్ వారిని చితకబాదారు. దీంతో కాంగ్రెస్ వారు తీవ్ర గాయాలతో బతుకుజీవుడా అనుకుంటే అక్కడ నుంచి బయట పడ్డారు.

నిరసన తెలిపినా దాడులే..!

2017లో జరిగిన నంద్యాల ఉప ఎన్నికల సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరస్పరంగా విమర్శించుకున్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఇరు పార్టీల శ్రేణులు నిరసనలు చేపట్టాయి. ఈ క్రమంలోనే కుప్పం ఆర్టీసీ బస్టాండ్ వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చంద్రబాబు దిష్టిబొమ్మను, టీడీపీ నేతలు జగన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ వారు దాడికి పాల్పడ్డారు. పిడిగుద్దులు కురిపిస్తూ తరిమికొట్టారు. చివరకు నిస్సహాయంగా వైఎస్సార్‌సీపీ నేతలు వెనుదిరిగారు. అలాగే రామకుప్పంలో చంద్రబాబుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టినందుకు 16 మందిపై ఎస్సీ, ఎస్టీ యాక్టు కింద కేసు నమోదు చేశారు. వీరికి కనీసం బెయిల్ కూడా రాకుండా తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. ఈ క్రమంలోనే రామకుప్పం మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో అవినీతిపై అప్పట్లో వైఎస్సార్‌సీపీ నేతలు పలు ఆరోపణలు చేశారు. దీనిపై జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగా సామాజిక తనిఖీలో వాస్తవాలు వెల్లడించేందుక వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులను స్థానిక టీడీపీ నేతలు తరిమి తరిమికొట్టారు. గుడుపల్లె మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత చంద్రశేఖర్ ఇంటి పట్టాలు ఇస్తామని పలువురి నుంచి రూ.25 లక్షలు వసూలు చేశారు. స్థానిక గంగమ్మ దేవాలయం చుట్టూ ఉన్న భూమి చదును చేసి విక్రయించేందుకు యత్నించారు. దీనిపై అభ్యంతరాలు వెల్లువెత్తాయి. చివరకు బాధితులకు నగదు తిరిగి ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. దీనిపై అప్పట్లో బాధితులు ఆందోళనలు చేపట్టడం గమనార్హం.

అధికారులపై ఒత్తిళ్లు

టీడీపీ అధికారంలో ఉన్న 2014–19 కాలంలో వారి ఒత్తిళ్లు తట్టుకోలేక పలువురు అధికారులు సెలవులపై వెళ్లిపోయారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుపడ్డారని అప్పటి శాంతిపురం తహసీల్దార్‌ను వేధింపులకు గురి చేశారు. దీంతో ఆయన దీర్ఘకాలిక సెలవు పెట్టాల్సి వచ్చింది. అలాగే కుప్పం ఎంపీడీఓ సైతం టీడీపీ నేతల ఒత్తిళ్లు తట్టుకోలేక అనారోగ్యానికి గురయ్యారు. కుప్పం పంచాయతీకి చెందిన ఇద్దరు ఈఓలు కూడా సెలవు పెట్టి వెళ్లిపోయారు. ఈక్రమంలో చంద్రబాబు మళ్లీ వస్తే ఇంకెలాంటి అరాచకాలు చూడాల్సి వస్తుందో అని కుప్పం ప్రజలు భయాందోళనకు గురవుతున్నట్లు సమాచారం.

అందరూ జగనన్న 'ఫ్యాన్స్'

సైదాపురం: జిల్లాలో వైఎస్సార్‌సీపీ సమరోత్సాహంతో ముందుకు సాగుతోంది. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దూసుకుపోతోంది. ఇందులో భాగంగా పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఆదివారం డక్కిలి మండలం, నరసనాయుడుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ యువత వైఎస్సార్ సీపీ బీసీ నేత డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పాటేళ్ల వెంకటరమణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ నాయకులకు కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

మత్తేరిమిట్టలో భారీగా చేరిక

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మండలం, మత్తేరిమిట్ట గ్రామ పంచాయతీలో టీడీపీకి చెందిన పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం ఆ గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పీ. మోహన్, పీ.శంకర్, పీ.కుమార్, మురగయ్య, వై.గురువయ్య, రాజేంద్ర, గంగయ్య, కే.చెల్లయ్య, కే.మోహన్, కే. జగన్నాథం, ఆర్.మణి, ఎం.బ్రహ్మయ్య, కే.వెంకటయ్య, ఆర్.నాగేశయ్య, కే.మునిరామయ్య, కే.వెంకటేష్, ఎన్. గురవయ్య పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎంపీ మద్దెల గురుమూర్తి, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, తాడిపర్తి నియోజకవర్గ పరిశీలకులు బీరేంద్రవర్మ, సీనియర్ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, మండల పరిశీలకులు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలానికి చెందిన పలువురు బీజేపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇందులో మండలంలోని కె.వెంకటాపురం, సుబ్బానాయుడుకండ్రిగకు చెందిన సుమారు 30 కుటుంబాలు ఉన్నాయి. వారికి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో బీజేపీ మండలాధ్యక్షుడు తోమూరు చెంగల్‌రెడ్డి, భాస్కర్, కృష్ణారెడ్డి, భక్తారెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మునస్వామిరెడ్డి, మోహన్‌రెడ్డి, మధు, మునిరాజా, వెంకటయ్య, రవి, రమేష్, బత్తెయ్య, వెంకటరెడ్డి, గురవయ్య, రోశయ్య, బత్తయ్య ఉన్నారు. నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రామిరెడ్డి, దామోదర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్కాడు ముత్తు, అమర్‌నాథ్‌రెడ్డి, జైచంద్రారెడ్డి, వయ్యాల మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

50 కుటుంబాలు చేరిక

గూడూరు రూరల్: మండలంలోని రెడ్డిగుంట, చెమిర్తి గ్రామాలకు చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి సర్పంచ్ పాలేపు వెంకటమ్మ, నాయకులు గోపాల్ ఆధ్వర్యంలో జగనన్న సేవా సమితి అధ్యక్షుడు ఊటుకూరు మహేంద్రరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మహేంద్రరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానం పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తల రాజేష్, నన్నూరు గోపాలయ్య, చరణ్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



సైదాపురం : వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ యువత



గూడూరు: పార్టీలో చేరిన వారితో జగనన్న సేవా సమితి అధ్యక్షుడు మహేంద్రరెడ్డి

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

నారాయణవనం: ప్రశాంత ఎన్నికలే లక్ష్యమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. ఆదివారం ఆయన నారాయణవనంలోని తమిళ ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఓటింగ్ కేంద్రాల ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సత్యవేడు రిటర్నింగ్ అధికారి నరసింహులు, పుత్తూరు డీఎస్పీ, నారాయణవనం తహసీల్దార్ శంకరరావు ఉన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



తరుణ్‌సాయితేజ (ఫైల్)

శ్రీకాళహస్తి(తొట్టంబేడు): స్నేహితులతో కలిసి బావిలో ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి మూర్ఛ రావడంతో నీటిలో మునిగి మృతిచెందిన సంఘటన తొట్టంబేడు మండలం, చిట్టత్తూరు సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద ఆదివారం జరిగింది. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కథనం.. శ్రీకాళహస్తి పట్టణం, ఎన్టీఆర్ నగర్‌కు చెందిన హరికృష్ణ, మాధవి కుమారుడు తరుణ్‌సాయితేజ(15), పట్టణంలోని జయరాంరావు వీధి, శ్రీసరస్వతీబాయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుండగా కుమార్తె జయశ్రీ అదే పాఠశాల్లో ఎనిమిదో తరగతి చదువుతోంది. తరుణ్‌సాయితేజ తరచూ మూర్ఛకు గురయ్యేవాడు. పాఠశాలలో ఇటీవల పదోతరగతి పరీక్షలు జరిగిన రోజుల్లో విద్యార్థులకు సెలవులు ఇవ్వడంతో అందుకు ప్రతిగా ఈ ఆదివారం పాఠశాల పనిదినంగా కొనసాగించారు. జయశ్రీ పాఠశాలకు హాజరుకాగా తరుణ్ సాయితేజ మాత్రం స్నేహితులతో కలిసి తొట్టంబేడు మండలం, చిట్టత్తూరు సమీపంలోని వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లాడు. బావిలో ఈతకు దిగిన అతను మూర్ఛకు గురికావడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రణాళికతో 'పది'లమే

పదోతరగతి ఫలితాలు సోమవారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులతో కలిపి జిల్లాలో 28వేల మంది పరీక్షలు రాశారు. ఫలితం ఏదైనా ఫర్వాలేదు...భవితకు బాటలేసేలా విద్యార్థులు ముందడుగు వేయాలని విద్యారంగ నిపుణులు పేర్కొంటున్నారు. టెన్త్ అనంతరం పాలిటెక్నిక్, ఇంటర్మీడియెట్, ఐటీఐ తదితర కోర్సుల్లో చేరేందుకు సమాయత్తం కావాల్సి ఉంటుంది. ఫలితం తారుమారైతే కొంపలు అంటుకుపోయేదేమీ లేదని విద్యార్థులు ముందుగా గ్రహించాలి. తదుపరి కార్యాచరణకు సమాయత్తం కావాలి. చదువు కొనసాగించాలా.. ఎలా ప్రణాళిక వేసుకోవాలి.. లేదా ఉన్న చదువుతోనే ఉపాధి వెతుక్కోవాలా..అందుకు అవకాశాలు ఎక్కడ ఉంటాయి తదితర అంశాలపై ప్రయత్నాలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

- నేడు పదోతరగతి ఫలితాలు
- జిల్లాలో 28 వేల మంది ఎదురుచూపు
- ఫలితం ఏదైనా ఫర్వాలేదు..భవితకు బాటలేయాలి
- సర్టిఫికెట్లు కేవలం విద్యార్హత తెలిపేవి మాత్రమే..
- మైక్రో సాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ డ్రాప్ అవుట్ విద్యార్థి
- పదో తరగతితోనూ ఉపాధి అవకాశాలు

తిరుపతి అర్బన్: ఫలితాలు వస్తున్నాయంటే అందరిలోనూ పెద్ద ఆందోళన ఉంటుంది. వాటి ప్రభావంతో పలువురు విద్యార్థులు కుంగుబాటుకు గురవుతుంటారు. మార్కులు తక్కువగా వచ్చాయి..ఉత్తీర్ణత కాలేక పోయామని విద్యార్థులు కుంగిపోకూడదని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఉన్నతస్థాయిలో రాణించాలని ఆలోచించడం మంచిపద్ధతే. సర్టిఫికెట్లు కేవలం విద్యార్హత తెలిపేవి మాత్రమేననే విషయాన్ని గ్రహించాలి. పదో తరగతితోనే ఉద్యోగ అవకాశాలున్నాయి. ఆర్టీసీ, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, రైల్వే, తపాలా తదితర శాఖల్లో ఉద్యోగాలను పొందే అవకాశముంది. ఈ విద్యార్హతతో ఉద్యోగాన్ని సాధించి, అనంతరం శాఖాపరమైన పరీక్షల్లో ప్రతిభ చూపి ఉన్నత స్థానాలకు చేరే అవకాశముంది. ఫెయిలయిన వారు కూడా మానసికంగా కుంగిపోగుండా పట్టుదలతో మళ్లీ చదవాలి. లేదా ఉన్న ఉపాధి అవకాశాలను వినియోగించుకుంటూనే చదువులో రాణించవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఉపాధి నైపుణ్యాలపై ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

ప్రపంచ మేధావులే ఆదర్శం

బిలిగేట్స్ డ్రాపౌట్ విద్యార్థి. మొదట ట్రాఫ్–ఓ–డేటా అనే వ్యాపారానికి సహ భాగస్వామిగా ఉండేవాడు. తదనంతరం కంప్యూటర్ ప్రోగ్రామింగ్ పట్ల అభిరుచి, నైపుణ్యంతో తన వైఫల్యాలను విజయాలుగా మార్చుకుని, మైక్రోసాఫ్ట్ కంపెనీకి మార్గదర్శకుడయ్యాడు. 31 ఏళ్ల పిన్న వయసులోనే బిలియనీర్‌గా మారాడు. ఆయనే కాదు ఫేస్‌బుక్ రూపకర్త జుకర్బర్గ్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువును మధ్యలో నిలిపివేశాడు. చిన్నతనంలో నేర్చుకున్న ప్రోగ్రామింగ్ ద్వారా తనలో సృజనాత్మక ఆలోచనలతో ఫేస్‌బక్‌ను రూపొందించి, అపర కుబేరుడయ్యాడు. మరోవ్యక్తిని గుర్తుచేసుకుంటే వాట్సప్ రూపకర్త జాన్కోమ్ యాహూలో ఉద్యోగం కోసం చదువును మధ్యలోనే వదిలేశారు. తల్లిని కోల్పోయి ఒంటరితనంతో బాధపడుతున్న ఆయనను స్నేహితుడు ఆదరించాడు. అతడితో కలిసి రూపొందించిన వాట్సాప్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అలాగే అబ్రహం లింకన్, థామస్ ఆల్వా ఎడిసన్, కల్నల్ శాండర్స్, ఫోర్డ్, నిక్ ఉజుచ్ ఇలా ఎందరో చదువుల్లో విఫలమైనప్పటికీ జీవితంలో అజేయంగా నిలిచారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థాయికి విద్యార్థులు చేరుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

పులివర్తి నాని అనుచరుల వీరంగం

- ఏ.రంగంపేటలో మారణాయుధాలతో యువకులపై దాడి
- కత్తిపోట్లకు గురైన రియాజ్, రాజ్‌కుమార్
- బాధితులను పరామర్శించిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



కత్తిపోట్లకు గురైన రియాజ్‌ను పరామర్శిస్తున్న హర్షిత్ రెడ్డి

చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అనుచరులు వీరంగం సృష్టించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారు. ఈ ఘట శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. దాడుల్లో రియాజ్, మరో కార్యకర్త రాజ్‌కుమార్‌పై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న చెవిరెడ్డి రెడ్డి హర్షిత్ రెడ్డి ఆదివారం ఏ.రంగంపేటకు చేరుకుని బాధితులను పరామర్శించారు. కత్తిపోట్లకు గురైన రియాజ్‌ను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మరో బాధితుడు రాజ్‌కుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి వారి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం టీడీపీ రౌడీల దాడిలో ధ్వంసమైన హోటల్, ఇంటిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ...ఉపాధి కోసం హోటల్ నిర్వహిస్తున్న అమాకులపై టీడీపీ గుండాలు దాడికి పాల్పడడం దారుణమని విచారం వ్యక్తం చేశారు.ప్రశాంతంగా ఉన్న చంద్రగిరిలో ఇలాంటి హింసలకు పాల్పడడం సరైన విధానం కాదన్నారు. ఓటమి భయంతోనే ఇలా తమ కార్యకర్తలపై పులివర్తి నాని అనుచరులు దాడులు చేస్తున్నారన్నారు. ఆయన వెంట పార్టీ డివిజన్ అధ్యక్షుడు బోస్ చంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మోనీష్ తదితరులున్నారు.

ఎన్నికల ఖర్చులపై ప్రత్యేక నిఘా

తిరుపతి అర్బన్: అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై ప్రత్యేక నిఘా ఏర్పాటైంది. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఏప్రిల్ 18వ తేదీ నోటిఫికేషన్ వచ్చే వరకు ప్రచారం కోసం చేస్తున్న ఖర్చులను ఆయా పార్టీల లెక్కల్లో చూపిస్తూ వచ్చారు. అయితే నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఖర్చులు పోటీలో ఉన్న అభ్యర్థుల లెక్కల్లో చూపిస్తున్నారు. ఈ అంశాలను ఎప్పటికప్పుడు కేంద్ర నుంచి విచ్చేసిన వ్యయపరిశీలన కమిటీ ప్రత్యేక నిఘా పెట్టింది.